# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి...?








**సైబరాబాద్, నవతరం:** కుత్బుల్లాపూర్ జోన్ గాజులరామారం సర్కిల్ పరిధిలోని లెనిన్ నగర్ లో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రధానంగా రోడ్ నెంబర్ 14, బి బ్లాక్లో వెలుస్తున్న ఓ ప్రధాన బిల్డర్ కి సంబంధించి స్థానికంగా ఉన్న నాయకుడు వత్తాసు పలుకుతున్నట్టు తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమత్తులో ఎందుకు ఉన్నారంటే వాళ్లకు ముట్టాల్సిన ముడుపులు ముట్టాయి అంటున్నారు ఇక్కడ జనం. అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ఇక్కడ వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక జనం డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక చోటామోటా నాయకులు ఈ అక్రమ నిర్మాణాలపై ఆధారపడకుండా ప్రజాసేవలు చేస్తే బాగుంటుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఇక్కడి అక్రమ నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేయడానికి స్థానికంగా ఉన్న సామాజిక కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు.

# "ఉత్తరాంధ్ర కాదు... మా పేరు కళింగసీమ"

**- తోకాంధ్ర ముద్ర తొలగించి అస్తిత్వం పునరుద్ధరించాలని డిమాండ్**
**- 2287 ఏళ్ల చరిత్ర ఉన్నా రాజ్యాధికారం లేక వెనుకబడ్డామన్న ఆవేదన**
**- "పేరు అనేది అస్తిత్వం... పేరు మారితేనే వాటా వస్తుంది" - డా. దువ్వాడ జీవితేశ్వర రావు**



**పలాస తేదీ: జులై 30, 2026 నవతరం దినపత్రిక**
ఇచ్ఛాపురం నుండి గోదావరి వరకు విస్తరించి ఉన్న ప్రాంతానికి ఉన్న చారిత్రక పేరు "కళింగసీమ". కానీ నేడు ఈ పేరు మరుగునపడి "ఉత్తరాంధ్ర" అనే పేరుతో పిలువబడుతోంది. ఈ పేరు మార్పు వెనుక ఉన్న రాజకీయ, సాంస్కృతిక కారణాలను, ప్రాంత వెనుకబాటుకు గల అసలు కారణాలను గురించి కళింగ సీమ సాధన సమితి కన్వీనర్ డా. దువ్వాడ జీవితేశ్వర రావు తో నవతరం దినపత్రిక ప్రతినిధి సుదీర్ఘంగా మాట్లాడారు.
ప్రశ్న 1: సార్, మొదటగా "ఉత్తరాంధ్ర" అనే పదాన్ని మీరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: "ఇది మన ఇంటి చిరునామాకు బదులు పక్కింటి చిరునామా రాసినట్టే!"
చూడండి, ఉత్తరాంధ్ర అంటే నిఘంటు అర్థం ఆంధ్రకు ఉత్తరాన ఉన్న ప్రాంతం. అంటే తోకాంధ్ర అని పరోక్షంగా చెప్పినట్టే. మనకు సొంతంగా 2287 ఏళ్ల చరిత్ర ఉన్న "కళింగసీమ" అనే మాతృనామం ఉండగా, మన శత్రు ప్రాంతం పేరును మన గుర్తింపుగా ఎందుకు వాడాలి? మన అస్తిత్వాన్ని మనమే తుడిచేస్తున్నాం.
"2287 ఏళ్ల రక్త చరిత్ర... కానీ గుర్తింపు లేదు"
ప్రశ్న 2: కళింగసీమ చరిత్ర గురించి ప్రజలకు తెలియజేయగలరా? డా. దువ్వాడ జీవితేశ్వర రావు: క్రీ.పూ. 261లో ఈ నేలపైనే కళింగ యుద్ధం జరిగింది. అంటే ఈరోజు నుండి 2287 సంవత్సరాల క్రితం. అశోకుని సైన్యాలతో మన కళింగ వీరులు ఈ మట్టి కోసం లక్షలాదిగా ప్రాణాలు ఇచ్చారు. ఆ రక్తపు నదులు చూసే అశోకుడు కత్తి పడేసి బౌద్ధుడిగా మారాడు. అప్పుడు కులాలు, గోత్రాలు లేవు. ఉన్నది ఒక్కటే "కళింగ గర్వం". 1953 వరకు మనం మద్రాస్ రాష్ట్రంలో ఉన్నాం. ఆ తర్వాత కూడా పాలకులు కావాలనే "కళింగసీమ" పేరును తీసేశారు.
"1936 విభజన – మనపై జరిగిన అతిపెద్ద కుట్ర"
ప్రశ్న 3: 1936 విభజన గురించి మీరు చెప్తున్నారు. అదేమిటి?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: "మహానది నుండి గోదావరి వరకు ఉన్న ఒకే జాతిని రెండు ముక్కలు చేశారు"
అది మనపై జరిగిన అతిపెద్ద కుట్ర. మహానది నుండి గోదావరి వరకు ఒకే భాష, ఒకే సంస్కృతి ఉన్న కళింగసీమను రెండు ముక్కలు చేశారు. ఉత్తర కళింగసీమను ఒరిస్సాలో కలిపారు. దక్షిణ కళింగసీమను మద్రాస్ రాష్ట్రంలో కలిపారు. అంతేకాదు, ఛత్రపూర్, గజపతి, గంజాం, పర్లాకిమిడి, కోరాపుట్, నవరంగ్పూర్, రాయగడ లాంటి 30% తెలుగు మాట్లాడే ప్రాంతాలను కూడా ఒరిస్సాకు ఇచ్చేశారు. ఆ రోజు అన్ని ప్రాంతాలు కలిసి ఉంటే ఈరోజు మన రాజకీయ బలం ఎలా ఉండేదో ఆలోచించండి.
"పేరు లేకపోవడమే వెనుకబాటుకు కారణం"
ప్రశ్న 4: పేరుతో రాజకీయానికి ఏమిటి సంబంధం? పేరు మారితే అభివృద్ధి వస్తుందా?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: "100% సంబంధం ఉంది. పేరు చెప్పుకోలేకపోతే వాటా ఎలా అడుగుతాం?"
మన ప్రాంతం పేరు మనం ఖచ్చితంగా చెప్పుకోలేకపోతే మనకు దక్కవలసిన హక్కులు ఎలా వస్తాయి? ఇప్పటి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర అనే మూడు ప్రాంతాలకు స్పష్టమైన గుర్తింపు ఉంది. వారికి వాటా ఉంది. కానీ మనం "ఉత్తరాంధ్ర" అని అస్పష్టంగా చెప్పుకోబట్టి మనల్ని వెనుకకు నెట్టేశారు. మన ఖనిజాలు, సముద్ర తీరం, వనరులు అన్నీ ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి.
ప్రశ్న 5: రాజకీయ ప్రాతినిధ్యం గురించి ఏమంటారు?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: "ఇదే అసలు బాధ. రాజ్యాధికారం లేకపోవడమే మన వెనుకబాటుతనానికి మూలం"
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్ర నుండి 5 మంది సీఎంలు, తెలంగాణ నుండి 8 సార్లు, రాయలసీమ నుండి 11 సార్లు సీఎంలు అయ్యారు. కానీ మన కళింగం నుండి ఒక్కరు కూడా లేరు. కారణం ఏమిటి? జాతీయ పార్టీ కాంగ్రెస్ లో కూడా మనం "మేము కళింగసీమ" అని గట్టిగా చెప్పుకోలేకపోయాం. "మనం కూడా ఆంధ్రులమే" అనే భావనలో ఢిల్లీ పెద్దలు ఉండిపోయారు.
"ఖనిజ సంపద ఉన్నా... వలసలే దిక్కు"
ప్రశ్న 6: మరి విద్య, వైద్యం, ఉద్యోగాల పరిస్థితి?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: అన్నీ దారుణంగా ఉన్నాయి. యావత్ భారతంలోనే ఖనిజ సంపద, సుదీర్ఘ సముద్ర తీరం, సారవంతమైన భూములు, మానవ వనరులు ఉన్న ప్రాంతం మనది. అయినా ఉద్దేశపూర్వకంగా "వెనుకబడిన ప్రాంతం" అని ముద్రవేశారు. మంచి కళాశాలలు లేవు, పెద్ద ఆసుపత్రులు లేవు, పరిశ్రమలు లేవు. మన పిల్లలు చదువు కోసం, ఉద్యోగం కోసం వలస వెళ్తున్నారు. పాఠ్యపుస్తకాల్లో మన చరిత్ర లేకపోవడంతో కొత్త తరానికి "కళింగసీమ" అనేది కొత్త పదంగా మిగిలింది.
"మూడు డిమాండ్లు – అస్తిత్వ పునరుద్ధరణ"
ప్రశ్న 7: మీ సమితి డిమాండ్లు ఏమిటి?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: మూడు ప్రధాన డిమాండ్లు.
1. పేరు పునరుద్ధరణ: ప్రభుత్వ రికార్డుల్లో, పాఠ్యపుస్తకాల్లో, అధికారికంగా "ఉత్తరాంధ్ర"కు బదులు "కళింగసీమ" అనే పేరును పునరుద్ధరించాలి.
2. చరిత్ర బోధన: కళింగ చరిత్రను పాఠశాల స్థాయి నుండే పిల్లలకు బోధించాలి.
3. ప్రత్యేక గుర్తింపు: కళింగసీమకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, ప్రత్యేక రాజకీయ గుర్తింపు ఇవ్వాలి.
ప్రశ్న 8: కొందరు "పేరు మార్చడం వల్ల ఏమి ఒరుగుతుంది" అంటారు. వారికి ఏమి చెప్తారు?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: "పేరు అనేది కేవలం పదం కాదు. అది అస్తిత్వం"
తెలంగాణ ప్రజలు "తెలంగాణ" అని గట్టిగా అడిగారు కాబట్టే రాష్ట్రం వచ్చింది. రాయలసీమ అని గుర్తింపు ఉంది కాబట్టే నిధులు వచ్చాయి. మనం మన పేరునే మర్చిపోతే ఎవరు మన గురించి మాట్లాడతారు? కళింగసీమ అనేది ఒక నినాదం కాదు. ఇది ఒక ప్రాచీన వారసత్వ ఉద్యమం.
ప్రశ్న 9: చివరిగా ప్రజలకు మీ సందేశం?
డా. దువ్వాడ జీవితేశ్వర రావు: కళింగసీమ మన అందరిది
కళింగ = ఒక ప్రాంతం, ఒక సంస్కృతి, ఒక చరిత్ర, ఒక గర్వం
ఎప్పుడైతే మన ప్రాంతాన్ని, మన చరిత్రను, మన గత వైభవాన్ని మనం విస్మరిస్తామో, అప్పుడే ఇతరులు మనల్ని వెనుకకు నెట్టేస్తారు. మన ప్రాంతం పేరును మనం ఖచ్చితంగా చెప్పుకోగలిగిన రోజే మన ప్రాంత వాటాలు మనకు లభిస్తాయి. అస్తిత్వ పునరుద్ధరణ కోసం అందరం కలిసి నడుద్దాం.

# జగన్‌కు సంఘీభావానికి వెళ్తున్న వైసీపీ నేతలను దేవు నల్తాడ వద్ద అడ్డుకున్న పోలీసులు

**పలాస తేదీ: జులై 30, 2026 నవతరం దినపత్రిక**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా అంపోలు జైలులో ఉన్న లిరాష్ట్ర మాజీ మంత్రి డా. సిదిరి అప్పలరాజులిను పరామర్శించేందుకు వెళ్తున్న సందర్భంగా, ఆయనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న పలాస నియోజకవర్గ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు ఆధ్వర్యంలో, ఎక్స్ ఎంపీటీసీ మారడ భాస్కర్ రెడ్డి, ఎక్స్ కౌన్సిలర్ రోణంకి వెంకటరమణ, అగ్రికల్చర్ బోర్డు మాజీ చైర్మన్ గొర్లు వేణు వల్లభ, వైకుంఠరావు, పి. ప్రభాకర్ రావు తో పాటు పలాస నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వైసీపీ శ్రేణులు గురువారం ఉదయం పలాస నుంచి అంపోలు జైలుకు బయలుదేరారు. వజ్రపు కొత్తూరు మండలం దేవు నల్తాడ వద్దకు చేరుకోగానే వజ్రపు కొత్తూరు ఎస్సై నేతృత్వంలోని పోలీసు బృందం వారి వాహనాలను అడ్డగించింది. 144 సెక్షన్ అమల్లో ఉందని, అనుమతి లేకుండా ముందుకు వెళ్లేందుకు వీల్లేదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో వైసీపీ నేతలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. బల్ల గిరిబాబు మాట్లాడుతూ "ఇది పూర్తిగా నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు జైలుకు వెళ్లి పరామర్శించే హక్కును కూడా కాలరాస్తున్నారు. ఒక నేతను పరామర్శించేందుకు వెళ్తుంటే ఇంతటి అడ్డంకులు సృష్టించడం దుర్మార్గం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరింది. ప్రజల గొంతు నొక్కేందుకు



పోలీసులను అడ్డుపెట్టుకుంటున్నారు. ఇది ప్రజా వ్యతిరేక పాలన. వెంటనే ఈ నిరంకుశ విధానాలను విడనాడాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ఇతర నేతలు కూడా పోలీసుల తీరును ఖండించారు. జగన్ గారి ఆదేశాల మేరకు తాము సంఘీభావానికి వెళ్తున్నామని, కానీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. దాదాపు గంటపాటు రోడ్డుపై వాగ్వాదం కొనసాగిన అనంతరం పోలీసులు నేతలను అక్కడి నుంచి వెనక్కి పంపించారు.

# సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వడియారం గ్రామంలో వర్షాల ముందస్తు చర్యలు



**చేగుంట జూలై 30**
చేగుంట మండలం వడియారం గ్రామంలో భారీ వర్షాల నేపథ్యంలో పూరి గుడిసెలు కూలిపోయే స్థితిలో ఉన్న పెంకుటిళ్లలో నివసిస్తున్న ప్రజలను సర్పంచ్ అంకన్నగారి సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ఎమర్జెన్సీ నివాసం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల లో గదులను ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని కోరారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో 88 మంది అనాధలకు అన్న ప్రసాదన్న వితరణ



**చేగుంట జూలై 30**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శివంపేట మండలం మగ్దంపూర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమంలోని 88 మంది అనాధలకు అన్న ప్రసాద వితరణ పండ్లుఅందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు మాట్లాడుతూ "సేవే పరమ ధర్మం. మనిషి జీవితానికి




నిజమైన అర్థం అతను సంపాదించిన సంపదలో కాదు, సమాజానికి అందించిన సేవల్లో ఉంది. పదవులు, బాధ్యతలు గౌరవాలు పొందడమే కాకుండా వాటిని ప్రజాసేవకు ఉపయోగించిన వారే సమాజంలో స్థిరంగా నిలిచిపోతారు" అని అన్నారు. లయన్ ఘట్టమనేని బాబురావు అలాంటి సేవా తపన కలిగిన వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమం




**చేగుంట జూలై 30**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో ఈరోజు శివంపేట మండలం మగ్దంపూర్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. బేతాని సంరక్షణ అనాధ ఆశ్రమం, మగ్దంపూర్ లో పర్యావరణ పరిరక్షణకొరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజనకు రామచంద్రం, సెక్రెటరీ బుర్కా నాగరాజు, డి.సి స్వర్గం సిద్దాములు, సభ్యులు ఆకుల సంజీవ్, గుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సంచారం -- భయంలో గ్రామీణులు

**? ప్రతిరోజూ వీధిలో కుక్కల కాపలా... చిన్న పిల్లలు, మహిళలకు తప్పని తిప్పలు**



**?చేగుంట జులై 30**
చేగుంట మండల కేంద్రంలోని సన్నటి గల్లీల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఆ దారి పొడవునా గుంపులుగా చేరి తీక్షణంగా చూస్తున్న కుక్కలను దాటుకొని వెళ్లాలంటే బాటసారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రతిరోజూ ఈ ఇరుకు మార్గం నుంచే పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, ఒంటరిగా నడిచే మహిళలు మరియు వృద్ధులు ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వణికిపోతున్నారు. వేరే ప్రాంతాల్లో వీధి కుక్కల దాడిలో చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దారిలోనే కోతులు కూడా కాపు కాచి కూర్చుంటుండటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలు, కోతుల ముప్పు నుండి ఊరట కలిగించాలని, ఏదైనా జరగరాని ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పరిస్థితి తీవ్రంగా ఉన్నందున చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

